క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడిగా నాగేశ్వరరావు



నాగేశ్వరరావుతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న విజయరాజు

చింతలపూడి: చింతలపూడి నగర పంచాయతీ పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడిగా కొప్పుల నాగేశ్వరరావు(నాగు) ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. స్థానిక శ్రీశ్రీ ఫంక్షన్ హాలులో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంభం విజయరాజు నాగేశ్వరరావుతో ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం పట్టణ అనుబంధ విభాగాలకు ఎంపికైన పార్టీ ప్రతినిధులు, మండల కమిటీ ప్రతినిధులను ఘనంగా సత్కరించారు.

సర్పంచ్ వెంకన్నబాబుకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ



సర్పంచ్ వెంకన్నబాబును పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే బాలరాజు

బుట్టాయగూడెం: చింతలగూడెంకు చెందిన మంగయ్యపాలెం సర్పంచ్ మాల్చి వెంకన్నబాబును మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు ఆదివారం పరామర్శించారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో వెంకన్నబాబు కుడిచెయ్యి విరిగింది. వైద్యం చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్న వెంకన్నబాబును బాలరాజు పరామర్శించి ఆరోగ్య స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకుని ప్రజా సేవలో నిమగ్నమవ్వాలని కోరారు.

దాతల సహకారంతో రోడ్డు



బాట గంగానమ్మ లేఅవుట్ కాలనీలో వేసిన మట్టి రోడ్డు

జంగారెడ్డిగూడెం: దాతల సహకారంతో ఆదివారం స్థానిక బాట గంగానమ్మ లేఅవుట్ కాలనీలో మట్టి రోడ్డు వేశారు. కాలనీలోని మెయిన్ రోడ్ (సీసీ రోడ్ మినహా) పూర్తిగా గుంతలమయం కావడంతో స్కూల్ విద్యార్థులు, కాలనీ వాసులు రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఇది గమనించిన శ్రీ అమ్మ నిలయం శ్యామ్ దాతల సహకారంతో రూ.18 వేలు సేకరించి మూడు టిప్పర్ల మట్టిని వేయించి పూర్తిగా చదును చేయించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కర్రి పవన్‌రెడ్డి, దుంగా నాగచంద్రరావు, ఆదడా పెద్దిరాజు, మొగిలి నీడి వెంకటేశ్వరరావు (అమ్మ నిలయం శ్యామ్) పాల్గొన్నారు.

భక్తుడికి గాయాలు



గాయాలపాలైన భక్తుడు సుబ్బారావు

ద్వారకాతిరుమల: శ్రీవారి కొండపైన జంటగోపురాల ప్రాంతంలో కళ్లు తిరిగి పడిపోవడంతో ఓ భక్తుడికి గాయాలయ్యాయి. విజయవాడలోని గొల్లపూడికి చెందిన రిటైర్డ్ బ్యాంక్ మేనేజర్ ఎం.సుబ్బారావు ఆదివారం సాయంత్రం కుటుంబ సభ్యులతో కలసి స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం బయటకు వచ్చే క్రమంలో అనివేటి మండపంలో కళ్లు తిరిగి పడిపోవడంతో స్వల్పంగా గాయపడ్డారు. కుటుంబ సభ్యులు, భక్తుల సహాయంతో జంటగోపురాల ప్రాంతానికి చేరుకుని మరోసారి అక్కడ పడిపోవడంతో తలకు తీవ్ర గాయమైంది. కుటుంబ సభ్యులు ఆలయ ప్రథమచికిత్సా కేంద్రానికి తరలించగా, అక్కడ వైద్య చికిత్స అందించారు.

ఉచిత బస్సు పూర్తిగా అమలు చేయాలి

దెందులూరు: ఉచిత బస్సు హామీ ఇచ్చినట్టుగానే రాష్ట్రమంతా అమలు చేయాలని సూపర్ సిక్స్ హామీల మాదిరిగా అరకొరా చేస్తే నిరసనలు, ఆందోళనలు చేపడతామని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి తోత్తడి వేదకుమారి అన్నారు. ఆదివారం దెందులూరులో ఆమె నివాసంలో మాట్లాడుతూ కూటమి నాయకులు ఎన్నికల ముందు ఉచిత బస్సు హామీ రాష్ట్రమంతా వర్తింపజేస్తాం, ఎవరైనా అడిగితే నా పేరు చెప్పండని చంద్రబాబు అనేక సభల్లో చెప్పారన్నారు. ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం గడిచినప్పటికీ నేటికీ ఉచిత బస్సు అమలు చేయకపోవడం ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఉచిత బస్సు పథకంపై మంత్రులు ఒకలా, అధికారులు మరోలా ముఖ్యమంత్రి వేరేలా మాట్లాడుతున్నారని విమర్శించారు. సూపర్ సిక్స్ హామీలు అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలం చెందిందని ప్రభుత్వం పై అన్ని వర్గాల ప్రజలు అసంతృప్తి, ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారన్నారు. మహిళలకు ఉచిత బస్సు రాష్ట్రమంతా అమలు చేయకపోతే వైఎస్సార్ సీపీ మహిళా విభాగాలు సమష్టిగా పోరాటం చేస్తాయన్నారు.

ఊపందుకున్న ఖరీఫ్ పనులు



బుట్టాయగూడెం శివారులో ఉన్న వరి నారుమడి



మహిళలు వరినాట్లు వేస్తున్న దృశ్యం

- అడపాదడపా కురుస్తున్న వర్షాలతో ముమ్మరంగా వరినాట్లు
- మెలకువలు పాటిస్తేనే మెరుగైన ఫలితాలు

బుట్టాయగూడెం: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనంతో ఏజెన్సీ ప్రాంతంలో అడపాదడపా వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో ఆలస్యంగా వరినాట్లు వేస్తున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో సాగు పనులు ఊపందుకున్నాయి. మరో పక్క కరెంట్ బోర్లు ఉన్న రైతులు వరినాట్లు పనులు పూర్తి చేస్తున్నారు. అయితే సాగులో మెలకువలు పాటిస్తే మెరుగైన ఫలితాలు సాధించవచ్చని వ్యవసాయ నిపుణులు, అధికారులు, శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.

నాట్ల సమయంలో సూచనలు

- సేకరించిన వరినారు లేత ఆకుపచ్చగా ఉంటే మంచిది. 25 నుంచి 30 రోజుల వయస్సు గల నారైతే దిగుబడి బాగా వస్తుంది.
- 4 నుంచి 6 ఆకులు ఉన్న నారు పొలంలో వేసుకునేందుకు ఉపయోగించాలి. ముదురు ఆకు నాటాల్సి వచ్చినప్పుడు అధికారుల సూచనలు తప్పనిసరిగా తీసుకోవాలి.
- వరినాట్లు వేసే సమయంలో భూసారానికి అనుకూలంగా చర్యలు చేపట్టాలి.
- ప్రతి 2 మీటర్లకు 20 సెంటీమీటర్ల మేర కాలిబాటలు ఉండాలి. అప్పుడే పైరుకు గాలి, వెలుతురు తగులుతుంది. ప్రధానంగా చీడ, పీడలు, సుడి దోమలను ఈ విధానంతో సమర్థవంతంగా అధికమించుకోవచ్చు.
- కాలిబాటల వల్ల ఎరువులు, పురుగుమందులను వేయడం, కలుపు తియ్యడం సులభంగా ఉంటుంది.
- వరి వంగడాల రకాలను అనుసరించి కుదుళ్ల సంఖ్య నాటే సమయంలో నిర్ధారించుకోవాలి.
- ముదురునారు వాడాల్సి వచ్చినప్పుడు అధికారుల సూచనల మేరకు నత్రజని ఎరువులు వాడుకోవాలి.

జాగ్రత్తలు పాటించాలి



వరి పండించే రైతులు సాగులో మెలకువలు పాటిస్తే మెరుగైన ఫలితాలు వస్తాయి. పంట ప్రారంభ దశ నుంచే జాగ్రత్తలు పాటించాలి. ప్రతి రైతూ తప్పనిసరిగా ఏ రకపు నేలకు ఏ పంట అనుకూలమో, ఏ పంట వేస్తే బాగా దిగుబడి వస్తుందనే విషయాన్ని తెలుసుకోవాలి.

– కె.గంగాధర్, మండల వ్యవసాయ అధికారి, జీలుగుమిల్లి

'కూటమి'ని గద్దె దింపే వరకు పోరాడుదాం

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కన్వీనర్ కంభం విజయరాజు



చింతలపూడిలో బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ కార్యక్రమంలో క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

చింతలపూడి: మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వాన్ని గద్దె దింపే వరకు పోరాడుదాం అని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కన్వీనర్ కంభం విజయరాజు పిలుపునిచ్చారు. స్థానిక వీకేఎం కళ్యాణ మండపంలో చింతలపూడి పట్టణ వైఎస్సార్ సీపీ విస్తృత స్థాయి సమావేశం పార్టీ పట్టణ అధ్యక్షుడు కొప్పుల నాగేశ్వరరావు అధ్యక్షతన ఆదివారం జరిగింది. కార్యక్రమంలో భాగంగా బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. విజయరాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 14 నెలలు కావస్తున్నా ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చలేకపోయిందని విమర్శించారు. యువతకు నిరుద్యోగ భృతి, మహిళలకు ఆడబిడ్డ నిధి, బీసీలకు 50 సంవత్సరాలకే పింఛన్ వంటి పథకాలు అమలు చేయలేదని దుయ్యబట్టారు. ఇక అన్నదాత సుఖీభవ సాయం ఎగ్గొట్టారని అన్నారు. నూరు శాతం హామీలను అమలు చేసి ప్రజల ఇంటి వద్దకు వెళ్లి ఓట్లు అడిగిన ఘనత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని అన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలి

బాబు ష్యూరిటీలకు గ్యారెంటీ ఉండదని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి జెట్టి గురునాథరావు అన్నారు. చంద్రబాబు మాటలు నమ్మి మోసపోవద్దు అని కోరారు. కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ఎండగట్టాలని పిలుపునిచ్చారు. ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ వాగ్దానం ఏమైందని ప్రశ్నించారు. వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రిని చేసుకునే యజ్ఞంలో ప్రతి ఒక్కరూ పాలు పంచుకోవాలని విజ్ఞప్తి చేశారు.

చింతలపూడిని జగన్‌కు గిఫ్ట్‌గా ఇస్తాం

వచ్చే ఎన్నికల నాటికి వైఎస్సార్ సీపీని మరింత బలోపేతం చేసి చింతలపూడిని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి గిఫ్ట్‌గా ఇస్తామని ఆ పార్టీ జిల్లా మున్సిపల్ విభాగం అధ్యక్షుడు బొడ్డు వెంకటేశ్వరరావు చెప్పారు. గత ప్రభుత్వం అర్హత ప్రామాణికంగా పథకాలు అందజేసిందని చంద్రబాబు ప్రభుత్వం తమ కార్యకర్తలకు పథకాలు ఇస్తుందని దుయ్యబట్టారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రతి ఇంటికి వెళ్లి వివరించాలని నాయకులకు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. అనంతరం క్యూఆర్ కోడ్‌ను సభలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ కామవరపుకోట మండల అధ్యక్షుడు రాయంకుల సత్య నారాయణ, లింగపాలెం మండల అధ్యక్షుడు అన్నపనేని శాంతరావు, జిల్లా పబ్లిసిటీ విభాగం అధ్యక్షుడు త్సల్లా బత్తుల శ్రీనివాసరావు, పార్టీ రాష్ట్ర నాయకులు చిలుకూరి జ్ఞానరెడ్డి, బీవీఎస్ రెడ్డి, నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు కె చండీప్రియ, నియోజకవర్గ యూత్ విభాగం అధ్యక్షుడు మిరియాల దిలీప్, నియోజకవర్గ ఎస్సీసెల్ విభాగం అధ్యక్షుడు కాంతారావు, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు గురుబ్రహ్మం, పట్టణ ఉపాధ్యక్షుడు ఎన్ దుర్గారావు, మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎండీ రఫీ, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు ఆత్కూరు సుబ్బారావు, తుమ్మూరి వెంకట్రామిరెడ్డి, గోలి చంద్రశేఖర్‌రెడ్డి, నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షులు, పార్టీ ముఖ్య నేతలు, ప్రజాప్రతినిధులు, మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కొయ్యలగూడెం: ఆరిపాటి దిబ్బలు కనకాద్రిపురం సబ్ స్టేషన్ పరిధిలోని కన్నాయిగూడెం ఫీడర్ పరిధిలో ఆర్‌డీఎస్ఎస్ పనుల నిమిత్తం సోమవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని జంగారెడ్డిగూడెం ట్రాన్స్‌కో డీఈ పీర్ అహ్మద్ ఖాన్ పేర్కొన్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పొంగుటూరు, కన్నాయిగూడెం గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

పది మంది జూదరుల అరెస్ట్



పట్టుబడ్డ పందెం రాయుళ్లతో ఎస్సై సుధీర్, పోలీస్ సిబ్బంది

ద్వారకాతిరుమల: మండలంలోని మలసాని కుంటలో ఆదివారం సాయంత్రం ఒక కోడి పందేల స్థావరంపై పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో 10 మందిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.4,770 నగదు, 8 బైక్‌లు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై టి.సుధీర్ తెలిపారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

పేకాట శిబిరంపై దాడి

జంగారెడ్డిగూడెం: స్థానిక జేపీ సెంటర్‌లో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై దాడి చేసినట్లు ఎస్సై షేక్ జబీర్ తెలిపారు. ఐదుగురిని అరెస్ట్ చేసి, రూ.4,100 స్వాధీనం చేసుకున్నామన్నారు.

ఇద్దరు వ్యక్తులపై దాడి

జంగారెడ్డిగూడెం: దాడి ఘటనలో ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై షేక్ జబీర్ తెలిపారు. వివరాల ప్రకారం సెంట్రింగ్ పనులు చేస్తున్న బొబ్బిలి వెంకటేష్ వద్ద బంటు రాము హెల్పర్‌గా పనిచేస్తున్నాడు. స్థానిక సాయిబాలాజి టౌన్‌షిప్ సెంటర్‌లో రాముపై నరేంద్ర, సాయి దాడి చేసి తీవ్రంగా కొట్టారు. విషయం తెలుసుకున్న వెంకటేష్ ఘటనా స్థలానికి చేరుకుని వారిని అడ్డుకోగా వెంకటేష్‌పై కూడా దాడి చేశారు. ఈ ఘటనలో గాయపడ్డ వీరిద్దరిని స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

జాతీయ జెండా స్ఫూర్తిని నింపాలి



తెల్లంవారిగూడెంలో హర్‌ఘర్ తిరంగా ర్యాలీ చేస్తున్న పీఓ, అధికారులు

బుట్టాయగూడెం: దేశ సార్వభౌమత్వానికి, ఆత్మగౌరవానికి ప్రతీక మన మువ్వన్నెల జాతీయ జెండా అని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కె.రాములు నాయక్ అన్నారు. మండలంలోని తెల్లంవారిగూడెం గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాలలో ఆదివారం హర్ ఘర్ తిరంగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినిలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశభక్తికి, సమగ్రతకు, జాతీయ భావానికి, ఐక్యతకు ప్రతిబింబంగా మూడు రంగుల పతాకం నిలుస్తుందని అన్నారు. ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఏర్పాటు చేసుకోవాలని, ప్రతి ఒక్కరిలో జాతీయ జెండా స్ఫూర్తిని నింపాలని పిలుపునిచ్చారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డీడీ ఎన్.శ్రీవిద్య, గిరిజన సంక్షేమ శాఖ ఇంజనీరింగ్ ఈఈ టి.లత, ఏటీడబ్ల్యూఓ జె.జనార్థన్, ఏఎంఓ కె.శిరమయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'కార్పొరేట్లను బహిష్కరించండి' జయప్రదం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కెచ్చెల రంగారెడ్డి

జంగారెడ్డిగూడెం: అఖిల భారత ఐక్య రైతు సంఘం (ఏఐయూకేఎస్) రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఆదివారం జంగారెడ్డిగూడెంలో నిర్వహించారు. స్థానిక పోస్ట్ ఆఫీస్ శివాలయం వద్ద వేల్పుల అర్లప్ప అధ్యక్షతన జరిగిన సమావేశంలో సంఘం జాతీయ కన్వీనర్ కెచ్చల రంగారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి ఎస్కే గౌస్ మాట్లాడారు. ఈనెల 13న కార్పొరేట్లను బహిష్కరించండి కార్యక్రమంలో భాగంగా జిల్లా, మండల కేంద్రాల్లో ర్యాలీలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. అలాగే ట్రంప్, మోడీ రెండు తలల దిష్టిబొమ్మను దహనం చేయాలన్నారు. ఈనెల 15 నుంచి నవంబర్ 26 వరకు ఎంఎస్‌పీని చట్టబద్ధం చేయాలని గ్రామాల్లో ప్రచారం నిర్వహించాలని, జిల్లా కేంద్రాల్లో వివిధ రూపాల్లో ఆందోళన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో వేల్పుల అర్లప్ప, బాచినేని సత్యనారాయణ పాల్గొన్నారు.

వేసవిని తలపిస్తున్న వర్షాకాలం

- ద్వారకాతిరుమల క్షేత్రంలో భక్తులకూ తప్పని కష్టాలు
- ఉష్ణతాపం నుంచి తట్టుకోలేక టవల్స్, చీరచెంగులు కప్పుకుని అవస్థలు
- జాగ్రత్తలు తప్పనిసరంటున్న వైద్యులు



తలపై చీర చెంగు కప్పుకుని ప్రసాదాల కౌంటర్ నుంచి వెళుతున్న మహిళ



జంటగోపురాల ప్రాంతానికి తలపై టవల్ కప్పుకుని వెళుతున్న భక్తుడు

ద్వారకాతిరుమల: ఎండలు ఠారెత్తిస్తున్నాయి. ప్రస్తుత వర్షాకాలం.. వేసవి కాలాన్ని తలపిస్తోంది. దాంతో సుర్రుమంటున్న భానుడితో జనం విలవిల్లాడుతున్నారు. ఉదయం 8 గంటల నుంచే ఎండ ప్రచండం చేస్తోంది. మధ్యాహ్నం 12 గంటల నుంచి అడుగు బయట పెట్టలేని పరిస్థితి ఉంది. దాంతో కొన్ని ప్రాంతాల్లో రహదారులు సైతం నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి. కొందరు సాయంత్రం 4 గంటల వరకు బయటకు రావడానికి జంకుతున్నారు. వర్షాకాలంలో మండు వేసవిని తలపించేలా ఎండలు కాస్తుండటంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. అడపాదడపా కురుస్తున్న వర్షాల వల్ల ఎటువంటి ప్రయోజనం ఉండక పోగా, వేడి, ఉక్కబోత మరింత పెరిగిపోతోంది. గృహాల్లో ఏసీల వాడకం మళ్లీ పెరిగిపోయింది. ఎండ వేడిమి నుంచి జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. తప్పనిసరి అయితేనే బయటకు వెళ్లాలంటున్నారు.

భక్తులపై భానుడి భగభగలు..

సుదూర ప్రాంతాల నుంచి ద్వారకాతిరుమల క్షేత్రానికి వస్తున్న భక్తులు భానుడి భగభగలకు అల్లాడుతున్నారు. భక్తులు తుండ్లు, కర్చీఫ్‌లను తలలపై వేసుకుంటుంటే, మహిళలు, వృద్ధులు చీర చెంగులను తలలపై వేసుకుని పరుగులు తీస్తున్నారు. చెట్లు కనిపిస్తే చాలు వాటి నీడలోకి వెళ్లిపోతున్నారు. చల్లదనం కోసం వెంపర్లాడుతున్నారు. వర్షాకాలంలో ఈ ఎండలేమిటి భగవంతుడా అని లబోదిబోమంటున్నారు. ఈ క్రమంలోనే వైద్యులు పలు సూచనలు చేస్తున్నారు.

ఆహార నియమాలు

- నీరు ఎక్కువగా తాగాలి.
- కాఫీ, టీ, శీతల పానియాలు తాగడం తగ్గించాలి.
- నీటి శాతం అధికంగా ఉండే పండ్లు తినాలి.
- జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండాలి.

ఎండ నుంచి రక్షణ ఇలా..

- బయటకు వెళ్లేటప్పుడు నెత్తికి టోపీ, ముక్కు, చెవులు కప్పి ఉంచేలా వస్త్రం కట్టుకోవాలి. లేత రంగు నూలు దుస్తులు ధరించాలి.
- మధ్య మధ్యలో నీడలోకి వెళ్లి సేద తీరాలి.
- వెంట నీళ్ల సీసా, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, కాటన్ వస్త్రం ఉంచుకోవాలి.
- ఎండలో పనిచేసేవారు మజ్జిగ, ఓఆర్ఎస్ ద్రావణం తీసుకోవాలి.

జాగ్రత్తలు పాటించాలి



ఎండల్లో తిరగడం మంచిది కాదు. ముఖ్యంగా చిన్న పిల్లలను ఉష్ణతాపానికి గురి కాకుండా చూడాలి. అనారోగ్య సమస్యలున్న వారు బయట తిరగడం మంచిది కాదు. అలాంటి వారు త్వరగా వడదెబ్బకు గురవుతారు. కొందరి పిల్లల్లో ముక్కు నుంచి రక్తం వస్తుంది. డీహైడ్రేషన్ లక్షణాల్లో ఇదొకటి. మూత్రం పచ్చగా వస్తే అప్రమత్తం అవ్వాలి. ఎండలో నీళ్లు ఎక్కువగా తాగాలి. ఎక్కువగా ద్రవ పదార్థాలు తీసుకోవాలి. లేకుంటే వడదెబ్బకు గురి కావాల్సి వస్తుంది.

– ప్రవీణ్ కుమార్, ద్వారకాతిరుమల పీహెచ్‌సీ వైద్యుడు

విద్యార్థులకు అసెస్‌మెంట్ పుస్తకాల్లోనే పరీక్షలు

- నేటి నుంచి సెల్ఫ్ అసెస్‌మెంట్ పరీక్షలు
- బుక్‌లెట్‌లోనే జవాబులు రాయాల్సిన వైనం

మండలం	పాఠశాలలు	విద్యార్థులు
గణపవరం	55	3519
నిడమర్రు	40	2399
ఉంగుటూరు	66	4581
భీమడోలు	42	3616

గణపవరం: ఈ విద్యా సంవత్సరంలో మొట్ట మొదటి పరీక్షలు సోమవారం ప్రారంభం కానున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థల్లో ఈ నెల 11వ తేదీ నుంచి 14వ తేదీ వరకూ ఫార్మేటివ్ అసెస్‌మెంట్ పరీక్షలు నిర్వహించడానికి విద్యాశాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ సారి పరీక్ష రాసే విధానంలో మార్పులు తీసుకొచ్చింది. ఒకటి నుంచి పదో తరగతి వరకూ విద్యార్థులు జవాబు పత్రాలకు బదులుగా బుక్‌లెట్‌లోనే జవాబులు రాయాల్సి ఉంటుంది. ఇప్పటికే అన్ని సబ్జెక్టులకు సంబంధించి అసెస్‌మెంట్ పుస్తకాలు విద్యార్థుల రోలు ప్రకారం ఆయా పాఠశాలలకు మండల వనరుల కేంద్రం నుంచి సరఫరా చేశారు. ప్రతి విద్యార్థికి ఒక్కో సబ్జెక్ట్‌కు సంబంధించి ఒక్కో పుస్తకాన్ని అందించనున్నారు. అంటే ప్రాథమిక స్థాయిలో నాలుగు అసెస్‌మెంట్ పుస్తకాలు, 6, 7, 8 తరగతులకు ఆరు అసెస్‌మెంట్ పుస్తకాలు, 9, 10 తరగతులకు 7 సబ్జెక్టులకు ఏడు అసెస్‌మెంట్ పుస్తకాలను అందించనున్నారు. ఈ విద్యా సంవత్సరంలో నిర్వహించే నాలుగు ఫార్మేటివ్ అసెస్‌మెంట్ పరీక్షలు, రెండు సమ్మేటివ్ అసెస్‌మెంట్ పరీక్షలకు సంబంధించి జవాబులన్నీ ఈ ప్రత్యేక బుక్‌లెట్‌లోనే రాయాల్సి ఉంటుంది. ఈ మార్కులను హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులలో నమోదు చేసి విద్యార్థులకు అందించనున్నారు. ఈసారి మార్కులను ప్రత్యేకంగా ఉపాధ్యాయులు వేయాల్సిన అవసరం ఉండదు. ఓఎంఆర్‌షీట్‌లో మార్కులు నమోదు చేసి స్కాన్ చేయగానే ఆటోమేటిక్‌గా యాప్‌లో నమోదవుతాయని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు.

ఉంగుటూరు నియోజకవర్గంలో వివరాలు ఇలా..

ఉంగుటూరు నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లోని 203 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా వీటిలో 14,115 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. సోమవారం నుంచి జరిగే ఫార్మేటివ్ బుక్‌లెట్‌లపై ఇప్పటికే ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. అయితే విద్యార్థులు అసెస్‌మెంట్ పుస్తకాల్లో పరీక్ష రాయడం వలన ఉపాధ్యాయులకు మరింత పని భారం పెరుగుతుందని, పుస్తకాలు దిద్దడం పెద్ద సమస్య కానుందని అంటున్నారు. పరీక్ష పేపర్ కట్టలను ఇంటికి తీసుకెళ్లి తీరిక సమయంలో దిద్దేవారమని, ఇప్పుడు పుస్తకాల కట్టలు ఇంటికి తీసుకెళ్లే పరిస్థితి ఉండదని, పాఠశాలలో దిద్దడం వలన బోధనకు ఆటంకం కలుగుతుందని అంటున్నారు.



విద్యార్థులు పరీక్షలు రాయవలసిన అసెస్‌మెంట్ పుస్తకాలు

పరీక్షలకు సర్వం సిద్ధం

ఈ విద్యా సంవత్సరంలో పరీక్షల విధానంలో కొత్త మార్పులు ప్రవేశ పెట్టారు. ఇక నుంచి విద్యార్థులకు జవాబులు రాయడానికి ప్రత్యేక పుస్తకం ఇస్తున్నాం. ఈ పుస్తకం విద్యా సంవత్సరంలో జరిగే అన్ని పరీక్షలకు ఉపయోగించాలి. పుస్తకంలోనే ప్రాజెక్ట్ వర్కులుకూడా చేయించాలి. విద్యా ర్థుల అభ్యసన సామర్థ్యాలు ఏ మేరకు మెరుగవుతున్నాయని అంచనా వేయడానికి ఈ విధానం ఉపయోగపడుతుంది.

– యర్రంశెట్టి శేషగిరిరావు, ఎంఈవో 2